సాక్షి ప్రకాశం

బుధవారం । 3 । జూలై । 2024



పనులు పూర్తయ్యేదెప్పుడు.. ఇక్కట్లు తీరేదెప్పుడు..?

మైదుకూరు నుంచి సింగరాయకొండ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో జాప్యం జరుగుతోంది. - 8లో..



ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన పొదిలి మండలం తలమళ్ల సమీపంలో జరిగింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 36/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపిక



జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఒంగోలు: జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికవడం ఆనందంగా ఉందని స్థానిక కృష్ణా మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ ఐ.వ సుంధరాదేవి పేర్కొన్నారు. 5వ తరగతి విద్యార్థిని అభిలాష, 4వ తరగతి విద్యార్థిని గీతాంజలి జూన్ 24న విజయవాడలో జరిగిన అండర్ 13, అండర్ 10 విభాగాల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు విద్యార్థినులను కరస్పాండెంట్ వసుంధరాదేవితోపాటు ప్రిన్సిపాల్ ఐ.లక్ష్మీ జాహ్నవి అభినందించారు.

ఏపీటీఎఫ్ 80 వసంతాల మహాసభ కరపత్రం విడుదల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) 80 వసంతాల మహాసభల కరపత్రాన్ని మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, ఏపీటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓను కలిసి ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుక, విద్యావైజ్ఞానిక మహాసభల నిర్వహణకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. జిల్లాలో సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ చేస్తున్నందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ చిరంజీవి, సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఐఫియా కౌన్సిల్ మెంబర్ పీవీ సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ వెంకటరావు, బీ అశోక్ కుమార్, జిల్లా కార్యదర్శి ఎం సురేష్, ఆడిట్ కన్వీనర్ ఎం సురేష్, ఆడిట్ కన్వీనర్ పి అంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత అర్హతపై ఆరా

అన్నదాతల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధిలో అనర్హుల ఏరివేతకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది వివరాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటికే 10 వేలకుపైగా లబ్ధిదారుల వివరాలను సేకరించి అప్‌లోడ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం ఇస్తున్న సాయంతో కలపి రూ.13,500 చొప్పున జిల్లాలో 2.96 లక్షల మంది రైతులకు రూ.1820 కోట్లు రైతులకు చెల్లించారు.

- పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితాపై విచారణ
- 5 శాతం మందిని పరిశీలించాలని ఆదేశాలు
- జిల్లాలో పీఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య 2,42,851
- 20,285 మంది వివరాల పరిశీలనకు చర్యలు
- పీఎం కిసాన్ కింద ఇటీవలే రూ.2 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1820 కోట్లు రైతులకు చెల్లింపు



ఒంగోలు సెంట్రల్: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం లబ్ధిదారుల జాబితా పరిశీలన, అనర్హుల గుర్తింపు, తొలగింపు చర్యలకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఈమేరకు లబ్ధిదారుల్లో 5 శాతం మంది వివరాలు ఆరా తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పరిశీలించాల్సిన రైతుల పేర్లను సైతం పంపింది. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది 2022-23, 2023-24 సంవత్సరాల్లో పీఎం కిసాన్ పథకంలో లబ్ధిపొందిన లబ్ధి దారుల వివరాలు ఆరా తీస్తున్నారు. లబ్ధిదారులు భౌతికంగా ఉన్నారా ? లేదా అనర్హులు ఎవరైనా ఉన్నారా ? లేదా తదితర వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారుల ఫొటో తీసి పీఎం కిసాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అర్హుల జాబితా పరిశీలన కార్యక్రమం కేంద్రప్రభుత్వం ఏటా నిర్వహిస్తోంది.


జిల్లాలో పీఎం కిసాన్ లబ్ధిదారులు ఇలా..

జిల్లాలో పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 2,42,851 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి గత నెలలో 17వ విడత కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల చొప్పున మొత్తం రూ.48.57 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి నుంచి అమలు చేస్తుంది. ఏడాదికి రూ.6 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటితో కలిపి రూ.13,500 చొప్పున రైతులు, కౌలు రైతులకు సైతం 2,95,584 మంది రైతులకు రూ.1820.802 కోట్లు రైతులకు అందించింది.

పరిశీలిస్తున్న అంశాలు..

- ఆదాయపు పన్ను కడుతున్న వారు ఈ పథకం లబ్ధి అందుకుంటున్నారా ?
- భూమి లేని వారు, ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ లబ్ధిపొందుతున్న వారు
- భూమి వివరాలు సరిపోకపోవడం
- 2019 తర్వాత భూమి రిజిస్ట్రేషన్ కావటం
- ఒకే కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఉండగా మరొక లబ్ధిదారుడిని పథకం వర్తించడం
- ఆధార్ మనుగడలో లేకపోవడం
- స్థానికంగా ఉండకపోవడం
- డూప్లికేట్ రిజిస్ట్రేషన్
- భూమి సాగు చేయకుండా స్వచ్ఛందంగా వదిలేయటం
- భౌతికంగా ఉంటున్నారా? లేదా ?
- 18 ఏళ్ల లోపు వయసు ఉన్న వారికి ఎవరికైనా పథకం వర్తిస్తుందా ?
- ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయిన తర్వాత పింఛన్‌దారుడై ఉండి పీఎం కిసాన్ పొందుతున్న వారు ఎవరైనా ఉన్నారా వంటి వివరాలను పరిశీలిస్తున్నారు.

జిల్లాలో 20,285 మంది లబ్ధిదారులను పరిశీలించనున్నారు. అందులో ఇప్పటికే 10,229 మందిని పరిశీలించి అప్‌లోడ్ చేశారు. అయితే రైతులు ముమ్మరంగా పనుల్లో ఉండటం, ఇతర ప్రాంతాల్లో సైతం కౌలు పొలాలు తీసుకొని పనుల్లో ఉండటంతో కొంత మేర వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నెట్ పనిచేయక యాప్ సక్రమంగా పనిచేయటం లేదు. దీంతో ఫోన్‌కు ఓటీపీ, బయోమెట్రిక్, ఫేస్ ఇండెక్స్ వంటి ఇతర పద్ధతుల ద్వారా గుర్తించాలని రైతులు కోరుతున్నారు.



యాప్‌లో పేర్కొన్న అంశాలు



తాళ్లూరు మండలంలో రైతు ఇంటి వద్ద పీఎం కిసాన్ లబ్ధిదారులను ఫొటో తీస్తున్న వీఏఏ



ప్రభుత్వ ఆదేశాల మేరకు: 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల్లో 5 శాతం పరిశీలించాలని ఆదేశాలు వచ్చాయి. జాబితా సంఖ్య సైతం వారే పంపారు. జిల్లాలో 2.42 లక్షల మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉండగా 20,285 మందిని పరిశీలించాల్సి ఉంది. ఇప్పటికే 51 శాతం పూర్తి చేశారు.

– ఎస్ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జేడీఏ, ఒంగోలు



దర్శి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం, ట్రాక్

రైలు కూతకు రెడీ !

- రెండు రోజుల్లో దర్శి నుంచి రైలు సౌకర్యం
- గుంటూరు, సికింద్రాబాద్‌కు రైలు నడిపే అవకాశం
- పరిశీలించిన ఉన్నతాధికారులు

దర్శి: రెండు రోజుల్లో దర్శి నుంచి రైలు సౌకర్యం కల్పించేందుకు ఉన్నతాధికారులు మంగళవారం దర్శి రైల్వే స్టేషన్‌కు వచ్చి చర్చించారు. దర్శి నుంచి వినుకొండ, శావల్యాపురం, పిడుగురాళ్ల మీదుగా సికింద్రాబాద్‌కు, వినుకొండ నరసరావుపేట మీదుగా గుంటూరుకు రెండు ట్రిప్‌లు లేదా ఈ రెండింటిలో ఒక ట్రిప్ సౌకర్యం కల్పించే ఆలోచనలో రైల్వే అధికారులు ఉన్నారు. అందులో భాగంగా టికెట్ కౌంటర్‌ను కూడా సిద్ధం చేశారు. మహిళలకు, పురుషులకు బాత్‌రూంలు, తాగునీటి సౌకర్యాలు కల్పించారు. అందులో భాగంగా అక్కడ పని చేస్తున్న కాంట్రాక్టర్లను రైలు ట్రాక్ సమీపంలో ఉన్న వస్తువులన్నీ తీసివేయాలని ఆదేశించారు. దీంతో రెండు రోజుల్లో రైలు వస్తుందన్న ఆశతో నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. కనిగిరి వరకు రైల్వేట్రాక్ పూర్తయినప్పటికీ దర్శి వరకు మాత్రమే ట్రైల్ రన్‌లు చేశారు.

దర్శి నుంచి పొదిలి, కనిగిరి మీదుగా శ్రీకాళహస్తి వరకు ఈ రైల్వే లైన్ పనులు చేస్తున్నారు. అవికూడా పూర్తయితే దూర ప్రాంతాల రైలు సౌకర్యాలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.362

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరధిలో పొగాకు ధర మంగళవారం గరిష్టంగా కేజీ రూ.362 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 5815 బేళ్లు రాగా, 5243 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 572 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 95వ రోజు వేలం పాటలో 3851 బేళ్లు రాగా 3577 వ్యాపారులు కొనుగోలు చేశారు. 274 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ఠ ధర రూ.362, కనిష్ఠంగా రూ.205, సరాసరి రూ.265 వచ్చింది. డీసీ పల్లి, కలిగిరి, కందుకూరు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 90వ రోజు వేలం పాటలో 1964 బేళ్లు రాగా, 1666 బేళ్లు కొనుగోలయ్యాయి. 298 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్ఠంగా రూ.359, కనిష్ఠ ధర రూ.205, సరాసరి రూ.185.55 పలికింది.



ముత్తుముల రామకృష్ణారెడ్డికి సెల్యూట్ చేసి నివాళులర్పిస్తున్న ఆర్మీ అధికారి సందీప్ యాదవ్



నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ముత్తుముల రామకృష్ణారెడ్డి అంతిమయాత్ర

వీరునికి కన్నీటి వీడ్కోలు

రాచర్ల: లద్దాఖ్ భారత్–చైనా సరిహద్దు సమీపంలోని షియోక్ నదిలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి (47) అంత్యక్రియలు ఆయన స్వగ్రామం మండలంలోని కాలువపల్లెలో బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య మంగళవారం నిర్వహించారు. ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలతో అంతిమయాత్ర నిర్వహించి, గన్‌సెల్యూట్ చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఆర్మీ ఉన్నతాధికారులు, జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు. రామకృష్ణారెడ్డి భౌతికకాయాన్ని కడసారి చూసి తుది వీడ్కోలు పలికేందుకు బంధుమిత్రులు తరలివచ్చి నివాళులర్పించారు.



భార్య ఉమాదేవికి జాతీయ జెండాను ఇస్తున్న ఆర్మీ కెప్టెన్ దిపక్ సింగ్





గన్ సెల్యూట్ చేస్తున్న ఆర్మీ జవాన్లు

వెలిగొండ ప్రాజెక్టు పునరావాసంపై దృష్టి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం: వెలిగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో పనులపై దృష్టి పెడతానని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా మార్కాపురం వచ్చిన సందర్భంగా ఆమె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకునేందుకు తాను ప్రాజెక్టు ప్రాంతాలు, నిర్వాసితుల గ్రామాలు, పునరావాస కాలనీల గురించి తెలుసుకునేందుకు పర్యటించానని అన్నారు. గొట్టిపడియ వద్ద నిర్మిస్తున్న ఇన్‌టెక్‌వెల్ ట్యాంకు పనులు కూడా పరిశీలించానని అన్నారు. ప్రజలతో కలిసి వారు సమస్యలు తెలుసుకున్నామన్నారు. వెనుకబడిన మార్కాపురం ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి కలెక్టర్ వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కలిశారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలని, ప్రస్తుతం సరఫరా చేస్తున్న ట్యాంకర్ల కంటే అదనంగా ట్యాంకర్ల సంఖ్యను పెంచి నీటి సరఫరా చేయాలని కోరారు. ఈమె వెంట సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, పలుశాఖల అధికారులు ఉన్నారు.

ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించాలి



ఆర్టీసీ ఆర్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకులు

ఒంగోలు: ఆర్టీసీ ఒంగోలు డిపోలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు మంగళవారం ఆర్టీసీ ఆర్‌ఎం బి.సుధాకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్యారేజీలో బస్సుల క్లీనింగ్, కాంప్లెక్స్ స్వీపర్లు, విచారణ కేంద్రంలో ఉద్యోగులు, కార్గోలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆరు నెలల నుంచి ఏడాది వరకు వేతన బకాయిలు ఉన్నాయన్నారు. ఈ వేతన బకాయిలను కాంట్రాక్టర్లు చెల్లించాలన్నారు. కాంట్రాక్టర్లకు ఆర్టీసీ చెల్లిస్తుందని చెప్పారు. అయితే ప్రస్తుతం బకాయిలు వల్ల ఉద్యోగులు ఆందోళనతో ఉన్నారని ఆర్‌ఎంకు వివరించారు. దీనిపై డిపో మేనేజర్‌తో మాట్లాడిన ఆర్‌ఎం సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్‌ఎంను కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపురెడ్డి, రీజియన్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



మద్దిపాడు పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపి ఉన్న గ్రావెల్ టిప్పర్లు

మద్దిపాడు: మండలంలోని అన్నంగి సమీపంలో గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లను మైనింగ్ శాఖ ఏడీ వీరేష్ సోమవారం రాత్రి పట్టుకుని సీజ్ చేశారు. అన్నంగి గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఆయన సోమవారం రాత్రి గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతానికి సిబ్బందితో చేరుకున్నారు. ఈ క్రమంలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు లేకపోవడంతో జేసీబీతో పాటు మూడు టిప్పర్లను సీజ్ చేశారు. టిప్పర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జేసీబీని తహశీల్దార్‌కు అప్పగించారు. వారికి అపరాధ రుసుం విధించనున్నట్లు మైనింగ్ ఏడీ తెలిపారు.

ఏఎస్సై వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ వేటు



యూనిఫాంలో మద్యం తాగుతూ ఈలలు వేస్తున్న ఏఎస్సై వెంకటేశ్వరరావు

ముండ్లమూరు: ముండ్లమూరు పోలీస్‌స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల వెంకటేశ్వరరావు శంకరాపురం – అద్దంకి పొలాల్లో ప్రైవేట్ వ్యక్తులతో కలిసి మద్యం తాగుతూ ఈలలు వస్తూ చిందులు వేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విషయం ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌కు చేరడంతో అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఎన్నికల అనంతరం శంకరాపురం వద్ద పికెట్ నిర్వహిస్తుండగా విధుల్లో ఉన్న ఏఎస్సై వెంకటేశ్వరరావు ప్రైవేట్ వ్యక్తులతో కలిసి మద్యం తాగుతూ చిందులు వేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, క్రమశిక్షణ రాహిత్యంలో భాగంగా చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్న సుద్దమట్టి





కందుకూరు పట్టణ బైపాస్ నిర్మాణంలో అసంపూర్తిగా ఉన్న మేజర్ బ్రిడ్జిలు

పనులు పూర్తయ్యేదెప్పుడు... ఇక్కట్లు తీరేదెప్పుడు..?

167-బీ జాతీయ రహదారి పనుల్లో జాప్యం

- కడప జిల్లా మైదుకూరు–సింగరాయకొండ వరకు 189 కి.మీ మేర జాతీయ రహదారి నిర్మాణం
- ఏడాదిన్నరగా సాగుతున్న మొదటి దశ పనులు
- 70 శాతం వరకు పనులు పూర్తయ్యాయంటున్న ఎన్‌హెచ్ అధికారులు

కందుకూరు: కడప జిల్లా మైదుకూరు నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వరకు నిర్మిస్తున్న నూతన జాతీయ రహదారి 167బీ రహదారి పనుల్లో జాప్యం చోటుచేసుకుంటుంది. మొత్తం 189 కి.మీ మేర చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణంలో మొదటి పనుల్లోనే తీవ్ర జాప్యం నెలకొంది. ఈ జాతీయ రహదారి పనుల్లో భాగంగా వలేటివారిపాలెం మండలం మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు మొదటి దశలో చేపట్టనున్న 45.73 కి.మీ రోడ్డు నిర్మాణ పనులు ఏడాదిన్నర కాలంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్తున్నా..గడువు లోగా పనులు పూర్తి కావడం సందేహాస్పదంగా మారింది. దీంతో ప్రస్తుతం ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మొదటి ప్యాకేజీలో 45.73 కి.మీ రోడ్డు

167బీ జాతీయ జాతీయ రహదారిని కేంద్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసింది. పనులు ప్రారంభానికే దాదాపు నాలుగేళ్ల సమయం పట్టింది. గతేడాది ప్రారంభంలో జాతీయ రహదారుల శాఖ అధికారులు పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు 45.73 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.310 కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా 23 శాతం లెస్‌తో రూ.240కోట్లకు వల్లభనేని కన్‌స్ట్రక్షన్ దక్కించుకుంది. ఆ తరువాత పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఏడాదిన్నర కాలంగా పనులు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో ఇప్పటి వరకు 70 శాతం వరకు పూర్తయినట్లు ఎన్‌హెచ్ అధికారులు చెప్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో కీలకమైన పనులన్నీ ఎక్కడివక్కడే ఉన్నాయి. పలుచోట్ల భారీ వంతెనలు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం మాలకొండ నుంచి కందుకూరు వరకు ఉన్న రోడ్డుకు చివరి దశ తారువేసే పనులు



బడేవారిపాలెం సమీపంలో పూర్తయిన రోడ్డు నిర్మాణం

చేస్తున్నారు. అయితే సింగరాయకొండ నుంచి కందుకూరు మధ్య రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. ఈ మార్గంలో పలు భారీ వంతెనలు ఇప్పటి వరకు ప్రారంభించలేదు. ప్రధానంగా కందుకూరు నుంచి సింగరాయకొండ మధ్యలో 12 కి.మీ రోడ్డును ఫోర్‌లైన్స్‌గా నిర్మించాలని భావించారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడంతో మూడు లైన్‌ల నిర్మాణానికే పరిమితమైయ్యారు. అదే సందర్భంలో ఈ రోడ్డు సీటీఆర్ఐ మధ్యలోంచి వెళ్తుంది. మొదట్లో రోడ్డు అలైన్‌మెంట్ ప్రకారం ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన అవసరం లేదు. అయితే సీటీఆర్ఐ అధికారుల విజ్ఞప్తి మేరకు ఇక్కడ భారీ ఫ్లైఓవర్ నిర్మాణం చేయాల్సి వస్తుంది. ఇప్పటి వరకు ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం పనులు కనీసం ప్రారంభం కాలేదు. అలాగే కందుకూరు పట్టణం ఉత్తరం వైపు 8.9 కి.మీ మేర రోడ్డు అర్ధచంద్రాకారంలో బయట నుంచి వెళ్తుంది. ఈ రోడ్డు పనులు కూడా అసంపూర్తిగా ఉన్నాయి. వంతెనలతో పాటు, ఫ్లై ఓవర్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతగా పనులున్నాయి. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన గడువు ముగిసినా మళ్లీ పొడిగించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వచ్చే సెప్టెంబర్ కల్లా పనులు పూర్తి చేస్తానం ఎన్‌హెచ్ అధికారులు చెప్తున్నారు. కానీ ప్రస్తుతం క్షేత్ర స్థాయి పనులను పరిశీలిస్తే ఇది ఏమాత్రం సాధ్యమయ్యేలా లేదు. మరో ఐదారు, నెలలు కూడా పనులు పూర్తికావనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పనుల నాణ్యతపై విమర్శలు

అలాగే ప్రస్తుతం జరుగుతున్న పనుల నాణ్యతపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తున్న గ్రావెల్ విషయంలో నాణ్యత లేని మట్టి ఉపయోగిస్తున్నారని మొదటి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా తెల్లటి శుద్ధమట్టి రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్నారు. దీంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డు మార్జిన్‌లు పూర్తిగా దెబ్బతింటున్నాయి. పూర్తి ఎర్రమట్టితో కూడిన గ్రావెల్‌ను ఉపయోగించాల్సి ఉన్నా పలు లేయర్లలో పూర్తిగా శుద్ధమట్టిని ఉపయోగిస్తున్నారు. భారీ వంతెనలు నిర్మిస్తున్న ప్రదేశాల్లోను ఇదే మట్టిని తోలుతున్నారు. దీని వల్ల రోడ్డు నాణ్యత సరిగా లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఎన్‌హెచ్ అధికారులు మాత్రం అన్ని పరీక్షలు నిర్వహించిన తరువాతే అనుమతులు ఇస్తామని, కాంట్రాక్టర్‌కు 5 సంవత్సరాల వరకు రోడ్డు మెయింటినెన్స్ చేయాల్సి ఉంటుందన్నారు. రోడ్డు నాణ్యతత దెబ్బతింటే కాంట్రాక్టరే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని చెప్తున్నారు.

పూర్తిగా అందని పరిహారం

ఈ రోడ్డు నిర్మాణానికి దాదాపు 110 ఎకరాల భూములను అధికారులు సేకరించారు. కానీ నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం మాత్రం చెల్లించలేదు. ఇటీవల పరిహారం చెల్లించాలంటూ కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు మాత్రం ఇప్పటి వరకు 90శాతం వరకు పరిహారం చెల్లించామని, ఇంకో 10శాతం మందికి మాత్రమే పరిహారం చెల్లించాల్సి ఉందంటున్నారు. ప్రస్తుతం జిల్లా జాయింట్ కలెక్టర్ వద్ద పరిహారానికి సంబంధించిన సమస్య ఉందని, దీన్ని త్వరలోనే పరిష్కరించి రైతుల పరిహారం అందిస్తామని చెప్తున్నారు.

ఇదీ 167బీ రోడ్డు నిర్మాణ ప్రతిపాదన

వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు వద్ద ఉన్న ఎన్‌హెచ్ 67 నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వద్ద ఉన్న ఎన్‌హెచ్ 16ని కలుపుతూ 189 కి.మీ మేర ఉన్న రోడ్డుని జాతీయ రహదారి 167బీగా గుర్తించారు. ఈ రోడ్డును జాతీయ రహదారి ప్రమాణాలకు అనుగుణంగా మొత్తం రూ.2000 కోట్లతో విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రోడ్డు పనులను మొత్తం నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ కింద నెల్లూరు జిల్లా మాలకొండ నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వరకు, 2వ ప్యాకేజీ కింద మాలకొండ నుంచి సీఎస్‌పురం, 3వ ప్యాకేజీ కింద సీఎస్‌పురం నుంచి కడప, 4వ ప్యాకేజీ కింద కడప నుంచి ముదిరెడ్డిపల్లి జంక్షన్ వరకు ఉన్నాయి. ముదిరెడ్డిపల్లి నుంచి తిరిగి మైదుకూరు వరకు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. మొత్తం నాలుగు ప్యాకేజీల కింద దాదాపు 189 కి.మీ మేర 3 లైన్‌ల రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. దీనిలో భాగంగా ప్రస్తుతం మొదటి ప్యాకేజీ పనులు 70శాతం పూర్తి కాగా, మిగిలిన ప్యాకేజీల పనులు జరుగుతున్నాయి.

రోడ్డు నాణ్యత బాధ్యత కాంట్రాక్టర్‌దే

ఎన్‌హెచ్ 167బీ జాతీయ రహదారి పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. మాలకొండ నుంచి సింరాయకొండ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. వచ్చే సెప్టెంబర్, నవంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పుల వల్ల రోడ్డు నిర్మాణంలో కొంత జాప్యం జరిగింది. ఐదేళ్ల వరకు రోడ్డు మెయింటినెన్స్ బాధ్యత కాంట్రాక్టర్‌దే. కావున నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడడం లేదు. పనుల పర్యవేక్షణ చేసి అవసరమైన సూచనలు చేస్తాము.

– సుమన్, ఎన్‌హెచ్ జేఈ



కొద్దిపాటి వర్షానికే దెబ్బతింటున్న మార్జిన్‌లు

వైద్యుడు దేవుడితో సమానం



డాక్టర్ హృదయనాథ్‌కు పురస్కారం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: వైద్యులు దేవుళ్లతో సమానమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. నేషనల్ డాక్టర్స్‌డేను పురస్కరించుకొని లయన్స్‌క్లబ్, జేవీవీ ఆధ్వర్యంలో వైద్యరంగంలో వైద్య రంగంలో విశేష సేలందించిన వైద్యులను సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ డాక్టర్ బందా జవహర్ పురస్కారం –24 పేరుతో వైద్యసేవలందించిన డాక్టర్‌లను గుర్తించి అవార్డులను ఇవ్వడం అభినందనీయమని డాక్టర్ జవహర్‌ను ప్రశంసించారు. డాక్టర్ బి.జవహర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే డాక్టర్లను గుర్తించి సత్కరించడం వల్ల వైద్య వృత్తిలో యవతకు స్ఫూర్తిగా ఉంటుందనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రావినూతలలో గత 50 ఏళ్ల నుంచి పేదలకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ హృదయనాథ్ డాక్టర్ బందా జవహర్ వైద్యసేవా పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ హృదయనాథ్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదైనా రోగులు కోలుకున్న తర్వాత వారి కళ్లల్లో కనిపించే ఆనందం ఎంతో సంతోషానిస్తుందన్నారు. రోగుల కళ్లల్లో చూసే ఆ ఆనందంతో వైద్యులు ఎన్ని సవాళ్లనైనా ఎదుర్కొగలుగుతారన్నారు. డాక్టర్ హృదయానాథ్‌ను బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా డాక్టర్ బందా జవహర్ వైద్య పురస్కారం అందజేసి సత్కరించారు. అనంతరం మరో 25 మంది వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ ఆర్ లక్ష్మీనారాయణ, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయకుమార్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు చలువాది బదరీనారాయణ, చలువాది రమేష్, నల్లూరి వెంకటేశ్వరరావు, జయప్రకాష్, కాలం సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



కల్లూరి వెంకటేశ్వర్లు(ఫైల్)

పొదిలి రూరల్: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తలమళ్ల గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని గోగినేనివారిపాలెంకు చెందిన కల్లూరి వెంకటేశ్వర్లు (55) పొలం నుంచి గడ్డి తెచ్చుకునేందుకు మోటార్ వాహనంపై వెళుతున్నాడు. ఈ సమయంలో కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు నుంచి కనిగిరి వెళుతుండగా తలమళ్ల సమీపంలో ఒంగోలు–కర్నూలు రహదారిపై బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లుకు శరీరానికి బలమైన గాయాలవడంతో ఒంగోలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవం

మార్కాపురం: భార్యను హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మార్కాపురం జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శుభవాణి మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. మార్కాపురం పట్టణంలోని శివాజీ నగర్‌లో నివాసముండే బలభద్రుని రంగయ్య తన కుమార్తె పార్వతిని పట్టణానికి చెందిన కొసనాల శరభయ్యతో 12 ఏళ్ల క్రితం వివాహం చేశాడు. అయితే మద్యానికి బానిసై తన భార్యపై అనుమానం పెంచుకున్న శరభయ్య 2019 జనవరి 16న ఇంట్లో నిద్రిస్తున్న భార్య పార్వతిని గొడ్డలితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై అప్పటి పట్టణ ఎస్సై ఆంజనేయులు, సీఐ శ్రీధర్‌రెడ్డి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలూ నాయక్ తెలిపారు. కోర్టు లైజన్ హెడ్‌కానిస్టేబుల్ ఐవీ శ్రీనివాసరావు, భాస్కర్‌రావును ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అభినందించారు.

శానంపూడి ఎంఎల్‌హెచ్‌పీ ఆత్మహత్య

- రైలు కింద పడిన రమావంత్ రవినాయక్
- బెట్టింగులే కారణమంటున్న గ్రామస్తులు



భార్య అలేఖ్యతో రవినాయక్(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రమణ

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి హెల్త్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న రమావంత్ రవినాయక్ (33) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి రైలు ఢీకొనడంతో మరణించిన సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం రమావంత్ నాయక్ సొంత గ్రామం పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గండిగనుమల తండా. ఇతను అలేఖ్యను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులుగా అలేఖ్య తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఉంటున్నారు. గత నెల 30వ తేదీ ఆదివారం అలేఖ్య తన భర్త నాయక్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉంది. సోమవారం కూడా స్విచ్ఛాఫ్ అనే రావడంతో అలేఖ్య తండ్రి శ్రీనివాసరావు ఈనెల 1న శానంపూడిలోని ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. దీంతో తన అల్లుడు రవినాయక్ కనబడటం లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైల్వే ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మంగళవారం ఓ మృతదేహాన్ని గుర్తించారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై టి.శ్రీరామ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడిని రవినాయక్‌గా ధ్రువీకరించారు. గత ఆదివారం రవినాయక్ స్కూటీపై వచ్చి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని, రోజులు గడవటంతో మృతదేహం కుళ్లిన స్థితిలోకి చేరుకుందని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలం సమీపంలో స్కూటీని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. బెట్టింగ్‌లో నష్టపోవడం వల్లే రవినాయక్ ఆత్మహత్య చేసుకున్నాడని శానంపూడి గ్రామస్తులు చెప్పుకొంటున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

ఆస్తి కోసమే దారుణ హత్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలసుందరరావు

రాచర్ల: ఆస్తి కోసమే అన్నపురెడ్డి చిన్న రంగారెడ్డిని దారుణంగా హత్య చేశారని మార్కాపురం డీఎస్పీ ఎం.బాలసుందర్‌రావు వెల్లడించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మార్కాపురం డీఎస్పీ ఎం.బాలసుందర్‌రావు మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించిన హత్య కేసు వివరాలు వెల్లడించారు. జూన్ 29వ తేదీ రాత్రి రాచర్ల మండలం రామాపురం గ్రామానికి చెందిన అన్నంపురెడ్డి చిన్న రంగారెడ్డి హత్యకు గురికాగా మృతుడి అక్క మదిరె రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చిన్న రంగారెడ్డికి అదే గ్రామానికి చెందిన ఇల్లూరి ఏసోబుతో చిన్నప్పటి నుంచి స్నేహం ఉంది. ఏసోబు కూలీ పనులకు వెళ్తూ తరుచుగా వారి ఇంటికి వెళ్లేవాడు. ఇద్దరూ కలిసి రోజూ మద్యం తాగేవాళ్లు. రెండేళ్లుగా రంగారెడ్డికి ఆయన మూడో భార్య రాజేశ్వరికి ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై రాచర్ల పోలీస్ స్టేషన్‌లో పరస్పర కేసులు నమోదయ్యాయి. అన్నపురెడ్డి చిన్నరంగారెడ్డి అక్కకు 1.26 ఎకరాల పొలాన్ని రాసిచ్చాడు. మిగిలిన ఆస్తిని రాజేశ్వరి తన కూతురి పేరు మీద రాయాలని కోరగా రంగారెడ్డి కాలయాపన చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో రంగారెడ్డిని హత్య చేసేందుకు ఇల్లూరి ఏసోబుతో కలిసి రాజేశ్వరి 20 రోజుల క్రితం పథకం రచించింది. అందుకుగాను రూ.20 వేలు సుపారీ ఇస్తానని ఏసోబుతో ఒప్పందం చేసుకుంది. జూన్ 29న లోక్ అదాలత్‌లో కేసు రాజీ పడుతున్నామని, అదే రోజు రంగారెడ్డిని చంపాలని ఏసోబుకు రూ.5 వేలు ఇచ్చింది. పథకం ప్రకారం అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో చిన్నరంగారెడ్డికి ఏసోబు ఫోన్ చేసి మద్యం తాగేందుకు పిలిచాడు. ఇద్దరూ కలిసి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో చింత చెట్ల కింద మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న రంగారెడ్డిపై ఏసోబు ముందుగానే సిద్ధం చేసి పెట్టుకున్న గొడ్డలితో దాడి చేశాడు. ఇద్దరి మధ్య పెనుగులాటలో కింద పడిపోయిన రంగారెడ్డి తలపై గొడ్డలితో నరకడంతోపాటు ముఖంపై కొట్టాడు. హత్య చేసిన విషయాన్ని రాజేశ్వరికి ఏసోబు ఫోన్ చేసి చెప్పాడు. మృతుడి అక్క రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టగా ఆస్తి కోసమే ఈ హత్య చేసినట్లు తేలిందని డీఎస్పీ వివరించారు. కేసును వేగంగా ఛేదించిన గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్, రాచర్ల ఎస్సై పి.సుబ్రమణ్యం, హెడ్‌కానిస్టేబుల్ కేశవరెడ్డిని డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ‘గద్దె జడ్సన్’ మృతి

- మృతుడు అగ్రిగోల్డ్ బాధితుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



గద్దె జడ్సన్

టంగుటూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన టంగుటూరు మండలంలోని సూరారెడ్డిపాలెం ఫ్లయ్‌ఓవర్‌పై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. అగ్రిగోల్డ్ బాధితుల పోరాట సంఘం (ఏబీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గద్దె జడ్సన్ సోమవారం రాత్రి బైక్‌పై టంగుటూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో సూరారెడ్డిపాలెం ఫ్లయ్ ఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. జడ్సన్ స్వగ్రామం మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ యూనియన్ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా ఒంగోలులో ప్రారంభమైన అగ్రిగోల్డ్ ఉద్యమాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్లడంలో ముఖ్యుడిగా ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పున్నారావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సమస్య గురించి మాట్లాడే ఒక గొంతు మూగబోయిందని అగ్రిగోల్డ్ బాధితుల పోరాట సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.